ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

బుధవారం 23 ఏప్రిల్ 2025



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తమిళ వారోత్సవంగా భారతి దాసన్ జయంతి

● అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తమిళ విప్లవ కవి భారతిదాసన్ జయంతి వేడుకలను రాష్ట్రమంతటా తమిళవారోత్సవంగా జరపనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు మంగళవారం ఉదయం శాసనసభలో సభానిబంధన 110 కింద ఓ ప్రకటన చేశారు. మహాకవి భారతియార్ తర్వాత తమిళ సాహిత్యాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లటమే కాకుండా, ద్రావిడ సిద్ధాంతాలను తన కవితలతో ఎలుగెత్తి చాటిన ఘనత భారతి దాసన్‌కే దక్కుతుందన్నారు. తమిళానికి అమృతమని పేరని, ఆ తమిళమే తమకు శ్వాస అని భారతిదాసన్ పామరుల నుండి పండితుల వరకు ఆకట్టుకునే తేలికైన పదజాలంతో కవితలు రాసారని, ఆ కవితల్లో సంగీత సౌరభాలు కూడా వెల్లివిరుస్తా యన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తరచూ తన ప్రసంగాల్లో భారతిదాసన్ కవితలను ఉదహరించేవారని గుర్తు చేశారు. భారతిదాసన్ రచనలను జాతికి అంకితం చేసిన ఘనత కూడా కరుణానిధికే దక్కుతుందని చెప్పారు. పెరియార్ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన భారతి దాసన్ తన రచనల్లో విప్లవాత్మక భావాలను కూడా చొప్పించేవారని స్టాలిన్ కొనియాడారు. భారతిదాసన్ రచనలు, సాహిత్యం భావితరాలకు అందించాలనే ఆశయంతో ఈ నెల 29 నుండి మే 5 వరకు భారతిదాసన్ కీర్తి ప్రతిష్ఠలను ఎలుగెత్తి చాటేలా పాఠశాలలు, కళాశాలల్లో తమిళ వారోత్సవాన్ని ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. అందులో ప్రభుత్వం తరఫున భారతిదాసన్ కవితలను ఆధారంగా చేసుకుని జిల్లా స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.. అదే విధంగా తమిళభాష ఔన్నత్యానికి పాటుపడే యువ రచయితలు, కవులకు 'భారతిదాసన్ యువ సృష్టికర్త' పేరుతో అవార్డులు అందజేస్తామని, ప్రఖ్యాత తమిళ సాహిత్యకారుల రచనల ఆధారంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని సీఎం వివరించారు. ఇదే విధంగా విద్యార్థులకు భారతిదాసన్ రచనలపై అవగాహన పెరిగేలా పాఠశాలలు, కళాశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన, కవితా పోటీలు నిర్వహించి బహుమతులందిస్తామని చెప్పారు. తమిళ సంగీతం, తమిళ బాణీ నృత్యం, తమిళ సంప్రదాయాలకు అనుగుణంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని,. ఈ వేడుకలకు తమిళ పండితులు, కవులు, యువకులు సాహితీ ప్రియులందరూ తప్పకుండా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు అసెంబ్లీ నివాళి

● జార్జికోటపై జాతీయ జెండా అవనతం

● అంత్యక్రియలకు మంత్రి, ఎమ్మెల్యే



పోప్ మృతికి సంతాపంగా సెయింట్ జార్జికోట వద్ద సగంవరకు జాతీయ జెండా అవనతం



పోప్ అంత్యక్రియలలో పాల్గొనేందుకు వెళ్తున్న మంత్రి ఎస్ఎం నాజర్, ఎమ్మెల్యే ఇనికో ఇరుదయరాజ్

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్యాథలిక్ మత పెద్ద, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ మృతికి రాష్ట్ర శాసనసభ సంతాపం ప్రకటించింది. ఆ మేరకు మంగళవారం ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే స్పీకర్ అప్పావు లేచి పోప్ మృతికి సంతాపతీర్మానం చదివారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు సహా శాసనసభ్యులందరూ లేచి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పోప్ ఫ్రాన్సిస్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం మంగళ, బుధవారాలను సంతాపదినాలను పాటిస్తుందని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. పోప్ మృతికి సంతాపంగా సెయింట్ జార్జ్ కోట పై ఉన్న జాతీయ జెండాను సగం వరకు అవనతం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరిని ఎంపిక చేసినట్లు స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర మైనారిటీల సంక్షేమం, విదేశీ తమిళులు సంక్షేమ శాఖల మంత్రి ఎస్ఎం నాజర్, ఎమ్మెల్యే ఇనికో ఎస్ ఇరుదయరాజ్ రోమ్‌లో జరుగనున్న పోప్ అంత్యక్రియలలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు.

దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

● గత ఏడాది 104 మందికి ఉద్యోగాలు

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారులకు అండగా ఉంటామని, అదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. మంగళవారం శాసనసభలో దివ్యాంగ క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఓ ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉదయనిధి మట్లాడుతూ గత ఏడాది అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి మార్గదర్శకాలతో దివ్యాంగ క్రీడాకారులు వంద మందికి 3 శాతం రిజర్వేషన్ కింద ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించామని తెలిపారు. ఆ ప్రకారం, ప్రభుత్వ శాఖల్లో 104 మంది క్రీడాకారులకు గత ఏడాది ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి అందజేశారన్నారు. అలాగే, ఈ ఏడాది కూడా 3 శాతం రిజర్వేషన్‌లో మరో వంద మంది క్రీడాకారులను ఉద్యోగాల్లో నియమించనున్నామన్నారు. గత ఏడాది చేపట్టిన 104 ఉద్యోగ నియామకాల్లో 11 మంది క్రీడాకారులు పోలీస్ కానిస్టేబుళ్లగా నియమించామన్నారు. అలాగే, పోలీసు శాఖలో 32 మంది ఎస్ఐల నియామకాలకు తమిళనాడు క్రీడాభివృద్ధి సమాఖ్య దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు కూడా త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని తెలిపారు. పోలీసు శాఖలో దివ్యాంగ క్రీడాకారులకు తప్పక ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగుల అభ్యున్నతి, సంక్షేమానికి ముఖ్యమంత్రి మార్గదర్శకాలతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గత వారం ముఖ్యమంత్రి ఈ సభలో దివ్యాగులను స్థానిక సంస్థల్లో నియమించనున్నట్లు ఒక బిల్లు ప్రవేశపెట్టారని, దేశంలోనే ఇలాంటి విధానం అమలుచేసిన మొదటి రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని, ఈ చొరవ ద్వారా సుమారు 13వేల మంది దివ్యాంగులు స్థానిక సంస్థల పదవుల్లో నియమితులు కానున్నారని తెలిపారు. అన్ని రంగాలతో సమానంగా క్రీడా రంగంలోనూ దివ్యాంగులు రాణించేలా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ముందు శిక్షణా ఫీజు, రవాణా ఖర్చులు తదితరాలను తమిళనాడు ఛాంపియన్స్ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 198 పారా క్రీడాకారుల శిక్షణ, ప్రయాణ ఖర్చుల కోసమే ఛాంపియన్ ఫౌండేషన్ నుంచి రూ.4.5 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో కనీసం 25 శాతం దివ్యాంగ క్రీడాకారులుండేలా చర్యలు చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు.

రెండు బిల్లులకు గవర్నర్ ఆమోదం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించిన రెండు బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు, తమిళనాడు పబ్లిక్ బిల్డింగ్ లైసెన్స్ సవరణ బిల్లు గతంలో అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, తీర్మానం చేశారు. ఈ బిల్లులను గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. ఈ బిల్లులను గవర్నర్ ఆమోదించినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది కాగా, శాసనసభలో తీర్మానం చేసిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారనే రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, బిల్లులు పెండింగ్‌లో ఉంచడం చట్టవిరుద్ధమంటూ, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి పంపే బిల్లులపై మూడు నెలల్లో గవర్నర్ చర్యలు చేపట్టాలని ఈ నెల 8వ తేది ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే, ఈ ఉత్తర్వులు వెలువడిన రోజే, రెండు బిల్లులను గవర్నర్ ఆమోదించడం గమనార్హం.

యూపీఎస్సీ ఫలితాల్లో తమిళ తేజం..

'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణ పొందిన శివచంద్రన్‌కు ప్రథమ స్థానం



శివచంద్రన్



పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన శివచంద్రన్ మంగళవారం విడుదలైన సివిల్ సర్వీస్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం, జాతీయ స్థాయిలో 23వ స్థానం సాధించారు. శివచంద్రన్ రాష్ట్ర ప్రభుత్వ 'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణ పొందారు. ఈ విషయమై శివచంద్రన్ మాట్లాడుతూ... యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా వుందన్నారు. పరీక్షలో విజయం సాధించేందుకు 'నాన్ ముదల్వన్' పథకం ఎంతగానో దోహదపడిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, జాతీయ స్థాయిలో 39వ స్థానం సాధించిన మోనిక కూడా 'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణ పొందారు. కాగా, 'నాన్ ముదల్వన్' పథకంలో శిక్షణ పొందిన 134 మందిలో 50 మంది 2024 యూపీఎస్సీలో ఉత్తీర్ణులయ్యారు. 50 మందిలో 18 మంది రెసిడెన్షియల్ శిక్షణార్థులుగా ఉన్నారు. అలాగే, తమిళంలో పరీక్ష రాసిన కామరాజ్, తంగపాండ్యన్ ఉత్తీర్ణులయ్యారు. ఇదిలా వుండగా శివచంద్రన్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందించారు.

పట్టాలు తప్పిన సబర్బన్ రైలు



పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీచ్ రైల్వేస్టేషన్‌లో సబర్బన్ రైలు పట్టాలు తప్పింది. ఆవడి నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు బీచ్ రైల్వేస్టేషన్‌కు వస్తున్న రైలులోని మూడో బోగీ కింద చక్రాలు పట్టాలు తప్పాయి. ఆ సమయంలో రైలు తక్కువ వేగంతో వస్తుండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కానీ, రైలు పెద్ద శబ్దంతో ఆగిపోడంతో భయాందోళన చెందిన కొందరు ప్రయాణికులు రైలు నుంచి దూకిన సమయంలో స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని చక్రాలను మళ్లీ పట్టాలపై చేర్చిన అనంతరం రైలు బీచ్ స్టేషన్‌కు వచ్చి చేరింది.

టాస్మాక్ అవినీతిపై ఆగని రగడ

● స్పీకర్ అనుమతి నిరాకరణ

● నిరసనగా అన్నాడీఎంకే వాకౌట్



అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతున్న అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మాట్లాడేందుకు అనుమతించని స్పీకర్ అప్పావు వైఖరికి నిరసనగా అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నేతృత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా మంగళవారం ఉదయం వాకౌట్ చేశారు. శాసనసభలో విద్యుత్ శాఖకు సంబంధించిన ఆర్థిక పద్దులపై ఆ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ పలు ప్రతిపాదనలు చేశారు. ఆ సందర్భంగా అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి నత్తం విశ్వనాధన్ స్పీకర్ కేటాయించిన సమయానికి మించి ప్రసంగించారు. ఆ తర్వాత ఈపీఎస్ లేచి టాస్మాక్ సంస్థలో అవినీతి ఎక్కువైందని ఆరోపిస్తూ కొన్ని గణాంకాలతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. స్పీకర్ అప్పావు వెంటనే జోక్యం చేసుకుని ముందుగా తనకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా టాస్మాక్ సంస్థపై మాట్లాడేందుకు ఎలా అనుమతిస్తానని ప్రశ్నించారు. విద్యుత్, ఎక్సైజ్ శాఖ ఆర్థిక పద్దుల ప్రతిపాదనలపై అన్నాడీఎంకే తరఫున ఇద్దరిని మాట్లాడేందుకు అనుమతించానని, వారు మాట్లాడకముందే టాస్మాక్ అవినీతిపై మాట్లాడేందుకు ఈపీఎస్ అదే పనిగా ప్రయత్నించడం తగదన్నారు. అయితే వెంటనే తనను మాట్లాడేందుకు అనుమతించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు. సీనియర్ మంత్రి దురైమురుగన్ జోక్యం చేసుకుని ప్రధాన ప్రతిపక్ష నేత ఈపీఎస్ సభలో మాట్లాడే హక్కు ఉందని, అదే సమయంలో అన్నాడీఎంకే పార్టీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు జోక్యం చేసుకుని మాట్లాడతానంటూ పట్టుబట్టడం తగదని హితవు పలికారు. టాస్మాక్ అవినీతిపై తమ ఆరోపణలను సభలోనే పొందుపరచాల్సి ఉందని, కనుక స్పీకర్ తనను మాట్లాడేందుకు అనుమతించాలని ఈపీఎస్ కోరారు. స్పీకర్ అప్పావు ససేమిరా కుదరదని తేల్చిచెప్పడంతో ఈపీఎస్, అన్నాడీఎంకే సభ్యులు స్పీకర్‌కు, సీఎం స్టాలిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ సభ నుండి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వెలుపల ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ గత నెల టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఈడీ తనిఖీలు జరిగాయని, ఆ తనిఖీల్లో రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగినట్టు ఈడీ ప్రకటించిందని, అలాంటప్పుడు ఈ అంశాన్ని సభలో లేవనెత్తడానికి ప్రయత్నిస్తే స్పీకర్ అప్పావు అదేపనిగా అనుమతించడం లేదన్నారు. స్పీకర్ వైఖరిని ఖండిస్తూ సభ నుండి తామంతా వాకౌట్ చేశామని తెలిపారు.

పింఛను పెంచాలంటూ దివ్యాంగుల నిరసన

● వెయ్యి మంది అరెస్ట్



కోయంబేడు బస్ టెర్మినల్‌లో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రంలో లాగే దివ్యాంగుల నెల వారి పింఛన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాజధాని నగరం చెన్నైలో మంగళవారం 10 ప్రాంతాల్లో అనుమతి లేకుండా ధర్నా చేపట్టిన వెయ్యి మందికి పైగా దివ్యాంగులను పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో దివ్యాంగులు తమ కోర్కెల సాధన కోసం మంగళవారం సచివాలయాన్ని ముట్టడించనున్నట్లు తమిళనాడు దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రకటించింది. ఈ హెచ్చరికలతో గ్రేటర్ పోలీసులు నగరంలో పలు ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో మోహరించారు. అయినప్పటికీ కోయంబేడు, ట్రిప్లికేన్, ఎళిలగం, ఎగ్మూర్, తేనాంపేట, పల్లావరం, కిలాంబాక్కం తదితర పది ప్రాంతాల్లో గుమిగూడిన దివ్యాంగులు ర్యాలీగా సచివాలయం వైపు నినాదాలు చేస్తూ బయలుదేరారు. ఆ ప్రాంతాల్లో అప్పటికే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ ప్రాంగణంలో ధర్మపురి, కృష్ణగిరి, తిరువణ్ణామలై, సేలం తదితర జిల్లాకు చెందిన 500 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాల్లో ఆ ప్రాంతంలోవ్ను కల్యాణ మండపాలకు తరలించారు. అదేవిధంగా ట్రిప్లికేన్, ఎళిలగం, మెరీనా బీచ్ రోడ్డు జంక్షన్‌లో బైటాయించిన దివ్యాంగులు తమకు నెలవారీగా పంపిణీ చేసే రూ.1500 పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని శాంతింపజేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో వంద మంది మహిళల సహా 250 మందిని అరెస్టు చేశారు. ఈ రకంగా కిలాంబాక్కం బస్ టెర్మినల్, పల్లావరం రైల్వేస్టేషన్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లలో తమ డిమాండ్ల కోసం రోడ్డెక్కిన దివ్యాంగులను కూడా అరెస్టు చేశారు. అరెస్టయిన సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకుడు మీడియాతో మాట్లాడుతూ.. పొరుగునే ఉన్న ఆంధ్రరాష్ట్రంలో దివ్యాంగులకు అక్కడి ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని, నెలవారీ పింఛన్ కూడా పెంచిందని, అదేవిధంగా తమకు కూడా పింఛన్ పెంచడంతో పాటు ఇతర సమస్యలను కూడా నెరవేర్చాలని కోరుతూ పలుమార్లు రాష్ట్రప్రభుత్వానికి విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం కనిపించలేదని, అందువల్లే రోడ్డెక్కాల్సివచ్చిందని తెలిపారు.



నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సమాచార దృశ్యని

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) చెంగల్పట్టు జిల్లా క్రీడాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం ఈ నెల 25 నుంచి మే 15వ తేది వరకు జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... మేల్‌కోటయూర్‌లోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్శిటీలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, విలువిద్య తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొనేందుకు 19 ఏళ్ల లోపున్న విద్యార్థినీ, విద్యార్థులు dsochengalpattu@gmail.com అనే మెయిల్‌లో పేర్లు నమోదుచేసుకోవాలి. మరిన్ని వివరాలకు 7401703461 అనే నెంబరు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

తాంబరం-తిరుచ్చి-తాంబరం ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-తిరుచ్చి-తాంబరం మధ్య ఈ నెల 29 నుంచి జూన్ 29వ తేది వరకు వారంలో ఐదు రోజులు (సోమవారం మినహా) ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06190 తిరుచ్చి-తాంబరం ప్రత్యేక రైలు తిరుచ్చి నుంచి ఉదయం 5.35 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06191 తాంబరం-తిరుచ్చి ప్రత్యేక రైలు తాంబరం నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి రాత్రి 10.40 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు చెంగల్పట్టు, మేల్‌మరువత్తూర్, దిండివనం, విల్లుపురం, బన్రూటి, తిరుపాదిపులియయూర్, చిదంబరం, శీర్గాళి, కుంభకోణం, పాపనాశం, తంజావూరు స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

చిదంబరం, బూదలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చిదంబరం, బూదలూరు రైల్వేస్టేషన్లలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగి వెళతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తాంబరం-సెంగోట్టై-తాంబరం (నెం.20683/20684) తాత్కాలిక ప్రాదిపదికన చిదంబరం రైల్వేస్టేషన్‌లో రెండు నిమిషాలు ఆగనుంది. అలాగే, తిరుచెందూర్-చెన్నై ఎగ్మూర్ మధ్య నడిపే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బూదలూరులో ఆగి వెళ్లనుందని, ఈ ప్రకటన మంగళవారం నుంచి అమలుకు వచ్చిందని దక్షిణ రైల్వే తెలిపింది.

సబర్బన్ రైల్వేస్టేషన్లలో ఛార్జింగ్ కేంద్రాలు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య నడుపుతున్న ఎమ్మార్టీఎస్ రైళ్లు 14 రైల్వేస్టేషన్ల మీదుగా నడుస్తున్నాయి. ఈ స్టేషన్‌లలో ఎలక్ట్రికల్ వాహనాలకు రీ ఛార్జింగ్ సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, తొలివిడతగా చింతాద్రిపేటలో రీ ఛార్జింగ్ కేంద్రం పనులు తుదిదశలో ఉన్నాయని, త్వరలో ఈ కేంద్రం అందుబాటులోకి వస్తుందని, అనంతరం మిగిలిన రైల్వేస్టేషన్‌లలో కూడా ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రేపటి వరకు బస్‌పాస్ విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) అందిస్తున్న నెలవారీ బస్ పాస్ విక్రయాలు గురువారం వరకు జరుగుతాయి. ఎంటీసీ బస్సుల్లో ప్రతినెలా 7 నుంచి 22వ తేది వరకు రూ.1,000, రూ.2,000 నెలవారీ బస్ పాస్ విక్రయాలు జరుగుతుంటాయి. అలాగే, నెలవారీ రాయితీ బస్ పాస్‌లు 1వ తేది నుంచి 22వ తేది వరకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో, ఈ నెల 10వ తేది మహావీర్ జయంతి, 14న తమిళ ఉగాది తదితర వరుస సెలవులు రావడంతో పలువురు స్వగ్రామాలకు వెళ్లడంతో బస్‌పాస్ కొనుగోలు చేయలేకపోయారు. నెలవారీ బస్ పాస్‌తో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్ పాస్ విక్రయాలు గురువారం వరకు పొడిగించినట్లు ఎంటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ సమయాలను ఆలయ అధికారులు ప్రకటించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలైకు ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అదే సమయంలో, పౌర్ణమి రోజున ఆలయ వెనుక వైపున్న కొండ చుట్టూ 14కి.మీ గిరిప్రదక్షిణ చేసేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు.ఆ ప్రకారం, చిత్రా పౌర్ణమి రోజైన మే 11వ తేది రాత్రి 8.47 నుంచి 12వ తేది రాత్రి 10.43గంటల వరకు గిరిప్రదక్షిణకు అనుకూల సమయమని ఆలయఅధికారులు ప్రకటించారు.

25న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 25న జరుగనుంది. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వం వహించనున్నారు. అన్నాడీఎంకే-బీజేపీ మధ్య కూటమి ఏర్పాటైన నేపథ్యంలో జరుగనున్న తొలి జిల్లా కార్యదర్శుల సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో చర్చించే తీసుకొనే నిర్ణయాలను మే 2న జరుగనున్న పార్టీ కార్యనిర్వాహక సమావేశంలో చర్చించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

మినీ టైడల్ పార్క్ ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో మినీ టైడర్ పార్క్ నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మినీ టైడల్ పార్కులు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు గత జూన్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా ప్రకటించారు. ఆ ప్రకారం, తిరువణ్ణామలైలో రూ.34కోట్లతో టైడల్ పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఏడాదిలో నిర్మాణం పూర్తిచేసి ఈ పార్క్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు, ఆ పార్క్ ఏర్పాటుతో తిరువణ్ణామలై, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాది మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అధికారులు తెలిపారు.

బస్టాండ్‌ను ప్రారంభించండి

● పుదుచ్చేరిలో అన్నాడీఎంకే ధర్నా



పుదుచ్చేరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో నిర్మాణ పనులు పూర్తి చేసిన కొత్త బస్టాండును ప్రారంభించాలని కోరుతూ అన్నాడీఎంకే మంగళవారం మరోమారు ధర్నా నిర్వహించింది. పుదుచ్చేరి అసెంబ్లీ సమీపంలో వున్న పాతబస్టాండును రూ.33 కోట్లతో విస్తరింపజేసి, ఆధునిక వసతులు సమకూర్చారు. ఈ బస్టాండు ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన 30 దుకాణాలను కేటాయింపుపై జరిగిన ఘర్షణల కారణంగా బస్టాండు ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ సారథ్యంలో కడలూరు రోడ్డులోవున్న తాత్కాలిక బస్టాండు సమీపంలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొని పుదుచ్చేరి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అన్బళగన్ మాట్లాడుతూ, కొత్త బస్టాండు పనులు పూర్తిచేసి, నాలుగు నెలల క్రితం నగర పాలకసంస్థకు బస్టాండును అప్పగించారని, ప్రజాధనంతో నిర్మించిన బస్టాండ్‌ను అప్పటివరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. కోర్టుకు సమీపంలోవున్న తాత్కాలిక బస్టాండ్ వల్ల ప్రతిరోజు ప్రయాణికుల రద్దీ పెరగటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి గత మూడు నెలల క్రితమే భూమి పూజ జరిగిందని, అయితే అక్కడున్న తాత్కాలిక బస్టాండును మార్చనందుకు వల్ల రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రారంభించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ అంశాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం కనిపించలేదన్నారు.

మాజీ మంత్రి జయకుమార్‌కు ఊరట

● రాష్ట్రప్రభుత్వ అప్పీలును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దురైపాక్కంలోని 8 గ్రౌండ్ల స్థలం హక్కుకు సంబంధించి మాజీ మంత్రి డి.జయకుమార్ అల్లుడు నవీన్‌కుమార్‌కు, అతని సోదరుడు మహేష్‌కు మధ్య గొడవలున్నాయి. ఈ క్రమంలో, గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన జయకుమార్, తన అధికారం ఉపయోగించి, తన అనుచరుల ద్వారా తన స్థలం కబ్జా చేశారంటూ మహేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేంద్ర నేర విభాగం పోలీసులు, జయకుమార్, ఆయన కుమార్తె జయప్రియ, అల్లుడు నవీన్‌కుమార్ తదితరులపై హత్యా బెదిరింపు సహా ఆరు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసు రద్దు చేయాలంటూ జయకుమార్ దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, కేసు రద్దు చేస్తూ గత ఏడాది సెప్టెంబరు 30వ తేది ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తులు మనోజ్ మిశ్రా, విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి, జయకుమార్ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వ అప్పీలు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

‘ఆలయాల’ జీర్ణోద్ధరణకు రూ.212 కోట్లు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ వర్గాల ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలోవున్న ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు ఇప్పటివరకు రూ.212 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో దేవాదాయ శాఖకు సంబంధించి పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శేఖర్‌బాబు సమాధానం చెబుతూ, ఆదిద్రావిడ ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు నిధులిచ్చే పథకాన్ని 1997వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి చేతుల మీదుగా ప్రారంభమైందని గుర్తుచేశారు. మొట్టమొదటి సారిగా ఒక ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.25వేలు రాయితీగా ఇచిచనట్లు తెలిపారు. ఈ నిధులను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఒక ఆలయానికి రూ.లక్ష పెంచగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.2.5 లక్షలకు పెంచిందన్నారు. పరమత్తి వేలూరు వాలవంది మున్సిపాలిటీలోవున్న మారియమ్మన్ ఆలయ రథం శిథిలావస్థకు చేరుకున్నందుర ఆ క్షేత్రంలో రథోత్సవం నిర్వహించలేకపోయారని, ఈ సమస్య పరిష్కరించాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్. శేఖర్ కోరారు. అందుకు స్పందించిన మంత్రి మారియమ్మన్ ఆలయ రథోత్సవం ఈ ఏడాది ఆడిమాసంలో నిర్వహించేందుకు తమ శాఖ నిర్ణయించిందని తెలిపారు. హిందూ దేవాదాయ శాఖకు సొంతమైన ప్రాంతాల్లో వ్యాపారం కోసం లీజుకు స్థలం అవసరమైనవారు ముందే దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిశీలించిన అనంతరం తక్కువ అద్దె నిర్ణయించి స్థలం కేటాయిస్తామని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

చెంగల్పట్టు జిల్లాలో రూ.వెయ్యి కోట్లతో

భూగర్భ డ్రైనేజీ పనులు

● మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో రూ.1,000 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో చెంగల్పట్టు జిల్లాలోని చెరువులు, సాగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ తీరుతెన్నెలపై చెంగల్పట్టు ఎమ్మెల్యే వరలక్ష్మి అడిగిన ప్రశ్నకు మంత్రి నెహ్రూ సమాధానమిస్తూ... మరైమలైనగర్ ప్రాంతంలో 33 నీటి వనరులున్నాయని, ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం 2.20 ఎంఎల్‌డీ మురికినీటి శుద్ధీకరణ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. మరో 37 కోట్లతో 15.92 ఎంఎల్‌డీ మురికి నీటిని శుద్ధీకరించేలా కొత్తగా ప్లాంటు నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపిన మంత్రి, త్వరలోనే నిర్మాణ పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెన్నై నగరంలోని 200 వార్డులు మినహాయించి, శివారు ప్రాంతాల్లో 3,898 నీటివనరులున్నాయని, తాంబరం నియోజకవర్గంలో రూ.211 కోట్లతో ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం కొత్తగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో కూడా రూ.845 కోట్లతో పనులు ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. చెంగల్పట్టు ప్రాంతంలో రూ.76.26 కోట్లు, మధురాంతకం ప్రాంతంలో రూ.9.50 కోట్లు, మరైమలైనగర్ ప్రాంతంలో రూ.300.57 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన తర్వాత శుద్ధీకరించిన నీరు మాత్రమే నీటివనరులకు తరలించేలా వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలోవున్న ఇతర నీటివనరులు కలుషితం కాకుండా అడ్డుకునేలా నిపుణుల కమిటీలు నియమించినట్లు మంత్రి నెహ్రూ తెలిపారు.

సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స



సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స చేస్తున్న దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పల్లడం ప్రభుత్వాసుపత్రిలో సెల్‌ఫోన్ వెలుగులో వైద్యులు చికిత్స చేయడంపై రోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పల్లడం సెంజేరిమలై ప్రాంతంలో సోమవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడి కాలు విరిగింది. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే పల్లడం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ సమయంలో ఆస్పత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆసుపత్రి ప్రాంగణంలోని జనరేటర్ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పనిచేయడం లేదు. దీంతో, వైద్యులు సెల్‌ఫోన్ వెలుగుల్లో క్షతగాత్రుడికి చికిత్స చేశారు. వైద్యులు సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

చిన్నారుల నిజాయితీ

● రోడ్డుపై దొరికిన సొమ్ము స్టేషన్‌లో అప్పగింత



చిన్నారులతో ఇన్‌స్పెక్టర్ శరవణన్

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే దొరికిన నగదును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన చిన్నారులను ఎస్‌ఐ సహా పలువురు అభినందించారు. పుదుకోట జిల్లా అరంతాంగి సమీపం వైరియల్ గ్రామంలో సోమవారం సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న నలుగురు చిన్నారులకు పక్కనే ఓ బ్యాగు కనిపించింది. బ్యాగులో చూడగా, అందులో రూ.5,000 నగదు కనిపించింది. వారు వెంటనే అరంతాంగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇన్స్‌పెక్టర్ శరవణన్‌కు అప్పగించారు. చిన్నారుల నిజాయితీని అభినందించిన ఇన్స్‌పెక్టర్, సమీపంలోని బేకరీకి తీసుకెళ్లి వారికి మిఠాయిలు తినిపించారు.

హెరాయిన్ విక్రయించిన ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో చట్టవిరుద్ధంగా హెరాయిన్ విక్రయించిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయానికి పలు ఫిర్యాదులందాయి. సెయింట్ థామస్ మౌంట్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందాలు మీనంబాక్కం ప్రాంతంలో నిఘా వేశాయి. అప్పుడు హెరాయిన్ తీసుకుని మత్తులో తూగుతూ కనిపించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారించగా తేనాంపేటలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ముబారక్ అలీ (37) వద్ద ఆ హెరాయిన్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. దీనితో తేనాంపేటకు వెళ్లి ముబారక్ అలీని అరెస్టు చేశారు. అతడిచ్చి సమాచారంతో ఎగ్మూర్‌లో ఉన్న ఓ హోటల్‌లో గది అద్దెకు తీసుకుని మకాం వేసి, మాదకద్రవ్యాలను విక్రయించిన మంసూర్ ఇస్లాంను అరెస్టు చేసి, అతని నుండి 28 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, మంగళవారం ఆలందూర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుపై నివేదిక

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హోసూరులో కొత్తగా విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన నివేదికను పౌర విమానయాన సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. రాష్ట్రంలో కోవై, తిరుచ్చి, చెన్నై తదితర అంతర్జాతీయ విమానాశ్రయాలు సహా ఆరు విమానాశ్రయాలున్నాయి. ఈ క్రమంలో, కృష్ణగిరి జిల్లా హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుచేయాలని ఆ ప్రాంత ప్రజలు, కర్మాగారాల యజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, హోసూరులో 2 వేల ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటించారు. ఆ ప్రకారం రెండు ప్రాంతాలు (హోసూరు తూర్పున ఒకటి, దక్షిణాన ఒకటి) ఎంచుకొని, వాటిలో ఏ ప్రాంతాలోనైనా విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతించాలని పౌర విమానయాన మంతిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ రెండు ప్రాంతాలను అధ్యయనం చేసిన విమానాయాన మంత్రిత్వ శాఖ, రెండు ప్రాంతాలూ అనువైనవేనంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక దాఖలుచేసింది.

నగరంలో ముగ్గురికి కొవిడ్ లక్షణాలు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముగ్గురు కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో రెండేళ్లుగా కరోనా నియంత్రణలో ఉంది. అయినా, కరోనా వ్యాప్తిని అడ్డుకొనేలా ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, సోమవారం 32 మందికి పరీక్షలు నిర్వహించగా, నగరంలో ఇద్దరు పురుషులు, ఒక మహిళకు కొవిడ్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. బాధితులు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నట్లు, ప్రస్తుతం వారు ఆరోగ్యంగా ఉన్నారని, వ్యాప్తి చెందే స్థాయికి కరోనా లక్షణాలు లేవని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

రూ.2వేల కోట్లకు పెరిగిన టాస్మాక్ ఆదాయం

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం అమ్మకాల ద్వారా గత ఏడాది కంటే ఈ సంవత్సరం టాస్మాక్ సంస్థ ఆదాయం రూ.2,489 కోట్ల మేరకు పెరిగిందని ఆ సంస్థ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థకు అన్ని జిల్లాల్లో మద్యం, చిల్లర దుకాణాలున్నాయి. ఈ దుకాణాల ద్వారా 2024-2025వ ఆర్థిక సంవత్సరం రూ.48,344 కోట్లు ప్రభుత్వానికి ఆదాయంగా ఇచ్చినట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. 2021-2022వ ఆర్థిక సంవత్సరంలో రూ.36,050 కోట్లు, 2023-2024లో రూ.44,121 కోట్లు 2023-2024లో రూ.45,855 కోట్లు, 2024-2025వ ఆర్థిక సంవత్సరంలో రూ.48,344 కోట్ల ఆదాయం వచ్చింది. దాని ప్రకారం 2023-2024వ ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది ఇప్పటివరకు అదనంగా రూ.2,489 కోట్లు ఆదాయం మద్యం విక్రయాల ద్వారా వచ్చినట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. ఇక విదేశీ మద్యం దిగుమతి చేసుకున్నందుకు ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 30వ తేదీవరకు ప్రత్యేక రుసుముగా రూ.62.88 కోట్లు సేవ పన్ను కింద రాష్ట్రప్రభుత్వానికి రూ.32.52 లక్షల ఆదాయం చేకూరింది.. అంతేకాకుండా ఎక్సైజ్ విభాగం ద్వారా రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు, యూనియన్ ప్రదేశాలకు, విదేశాలకు బీరు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది.. 2024-2025వ ఆర్థిక సంవత్సరంలో గత మార్చి 31వ తేదీ వరకు ఇతర రాష్ట్రాలు, యూనియన్ ప్రదేశాలు, విదేశాలకు 21,80,465 బీరు కేసుల ఎగుమతి ద్వారా రూ.777.07 లక్షల ఆదాయం వచ్చిందని టాస్మాక్ అధికారులు తెలిపారు.

పాదరక్షల గోదాములో అగ్నిప్రమాదం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలోని పాదరక్షల గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. రామ భజన ఆలయ వీధిలో ముకుందన్‌కు సొంతమైన రెండతస్తుల పాదరక్షల దుకాణం, గోదాము ఉన్నాయి. మంగళవారం ఉదయం గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ముకుందన్ ఫిర్యాదుపై వేలూరు దక్షిణం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మంత్రి పొన్ముడి రాజీనామా చేయాలి



ధర్నాలో అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు

వేలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా మాట్లాడిన పొన్ముడి మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నాడీఎంకే నేతలు డిమాండ్ చేశారు. స్థానిక అన్నా ఆడిటోరియం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ మానగర జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు, కోశాధికారి మూర్తి , పార్టీ అనుబంధ మహిళా విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

సరకుల నౌక ఢీకొని జాలర్ల మరపడవ ధ్వంసం



నౌక ఢీకొనటంతో ధ్వంసమైన మరపడవ వెనుకభాగం

టి.నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా ముట్టం సమీపంలో సముద్రంలో వేగంగా వెళుతున్న ఓ నౌక చేపలు పడుతున్న జాలర్ల మరపడవను ఢీకొంది. దీంతో జాలర్లకు చెందిన మరవపడవ పూర్తిగా ధ్వంసమైంది. ముట్టం సమీపంలోని చేపలరేవు నుండి కడియపట్టినం ప్రాంతానికి చెందిన అరుళ్ రమేష్ అనే వ్యక్తికి చెందిన మరపడవలో చేపలవేటకు బయలుదేరారు. ఆ పడవను లారెన్స్ నడుపుతుండగా 21 మంది జాలర్లు ముట్టం ప్రాంతం నుండి 22 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంలో చేపలవేట సాగించారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ఓ సరకుల ఓడ వేగంగా వచ్చి మరపడవను ఢీకొంది. అదే సమయంలో పడవలో ఉన్నవారంతా చెల్లాచెదురుగా పడ్డారు. ఈ సంఘటనలో ఆ మరపడవ వెనుక భాగం క్రేన్ ప్రాంతం ధ్వంసమైంది. దీనితో జాలర్లు చేపలవేట ఆపి తీరానికి చేరుకున్నారు. ఆ సంఘటనపై కులచ్చల్ మెరైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దెబ్బతిన్న మరపడవను పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు జరిపిన విచారణలో తూత్తుకుడి వెళ్లున్న సరకుల నౌక జాలర్లకు చెందిన మరపడవను ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయినట్లు కనుగొన్నారు. ఆ మేరకు ఈ సంఘటనపై తూత్తుకుడి ఓడరేవు అధికారుల వద్ద విచారణ జరపాలని పోలీసులు నిర్ణయించారు.

రూ.1.50 లక్షలకు పసికందు విక్రయం

● సిద్ధవైద్యురాలి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ద్వారా ఓ విద్యార్థినికి జన్మించిన ఐదు రోజుల పసికందును రూ.1.50 లక్షలకు విక్రయించిన వ్యవహారంలో సిద్ధవైద్యురాలిని అరెస్టు చేసినట్లు కడలూరు జిల్లా పోలీసులు తెలిపారు. జిల్లాలోని చిదంబరం కామరాజర్ నగర్‌కు చెందిన ఓ దంపతులకు 15 ఏళ్ళుగా సంతానం లేకపోవడంతో, వారు ఓ శిశువును దత్తత తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం పలువురు వైద్యులు, మిత్రులను ఆ దంపతులు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గత వారం ఆ దంపతుల ఇంట్లో ఉన్న ఓ పసికందును చూసి అనుమానించిన స్థానికులు వెంటనే జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కడలూరు పిల్లల సంరక్షణ విభాగం అధికారి చిత్రావతి తన బృందంతో సంబంధిత ఇంటికి వెళ్ళి విచారించారు. సంతానం లేనందువల్ల వడలూరులోని ఓ సిద్ధ వైద్యురాలి వద్ద ఐదురోజుల క్రితం జన్మించిన పసికందును రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అనంతరం వైద్యురాలిని అరెస్టు చేసి విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. వడలూరు ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినికి ఓ యువకుడితో ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా ఆమె ఓ శిశువుకు జన్మనిచ్చినట్లు తెలిసింది. ఆ తర్వాత సంబంధిత దంపతుల నుండి స్వాధీనం చేసుకున్న పసికందును స్థానిక పిల్లల సంరక్షణా కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

రైతు ఖాతానుండి రూ.35వేల చోరీ

● ముగ్గురు యువకుల అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో ఓ రైతు బ్యాంకు ఖాతా నుండి రూ.35వేలు కాజేసిన ఢిల్లీకి చెందిన ముగ్గురు యువకులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా పట్టుకోట బాలాయి అగ్రహారానికి చెందిన రవిచంద్రన్ అనే రైతు సెల్‌ఫోన్‌కు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. అవతలవైపు నుండి మాట్లాడిన వ్యక్తి పాఠశాల విద్యాశాఖ నుండి మాట్లాడుతున్నట్లుగా పరిచయం చేసుకున్నాడు. రవిచంద్రన్ పెద్దకుమారుడికి స్కాలర్‌షిప్‌గా రూ.14వేలు వచ్చిందని, ఆ నగదును బ్యాంకులో జమచేస్తామని చెప్పి, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్ తదితర వివరాలను కోరారు. దానిని నమ్మిన ఆ వ్యక్తికి వాట్సాప్ ద్వారా వివరాలను పంపించిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే తన బ్యాంకు ఖాతానుండి రూ.35.113వేలు డ్రా చేసినట్లు మెసేజీ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి రవిచంద్రన్ వెంటనే తంజావూరు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దీనిపై విచారణ జరిపిన పోలీసులకు ఢిల్లీకి చెందిన అశ్వకుమార్ (30), శుభకుమార్ (22), అనుజ్‌కుమార్ రాజా (24)అనే వారిగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు.

తిరుచెందూరులో ఇరువర్గాల ఘర్షణ

ఐదుగురికి గాయాలు ● 15 మంది అరెస్టు



తిరుచెందూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరులో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుచెందూరు గోకుల్‌నగర్‌కు చెందిన గ్యాస్ సిలిండెర్ల డిస్ట్రిబ్యూటర్ కన్నన్ ఆదివారం సాయంత్రం గ్యాస్ సిలిండెర్లను పంపిణీ చేసేందుకు లోడ్ ఆటోలో వెళ్లారు. మార్గమధ్యంలో నీలపురం ప్రాంతానికి చెందిన జపరాజ్ (60) అనే వృద్ధుడు వేగంగా బైకు నడుపుతూ వచ్చి ఆటోను ఢీకొన్నాడు. ఆ సందర్భంగా కన్నన్‌పై జపరాజ్ దాడి చేశాడు. ఆ సంఘటన నేపథ్యంలో సోమవారం రాత్రి కన్నన్, అతడి మద్దతుదారులు కలిసి నీలాపురంలో ఉన్న జపరాజ్ ఇంటికి వెళ్ళి గొడవపడ్డారు. ఆ సమయంలో కన్నన్ అనుచరుల దాడిలో జపరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత జపరాజ్ కుమారుడు నవీన్ (32), అతడి అనుచరులు తిరుచెందూరు యూనియన్ కార్యాలయం వద్ద కన్నన్ అతడి అనుచరులపై వేటకొడవళ్లతో దాడికి దిగారు. ఈ ఘర్షణలో కందవేల్ (21), నట్వార్ ఆనంద్ (20), విజయ్ ప్రకాష్ (27), నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుచెందూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఈ ఘర్షణలతో సంబంధం కలిగిన 15 మందిని అరెస్టు చేశారు.

టాలెంట్ పరీక్షల విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ సమాఖ్య ప్రతి సంవత్సరం జిల్లా స్థాయి టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ పరీక్షలకు 4 నుంచి ప్లస్ టూ తరగతుల విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ ఏడాది నిర్వహించిన పరీక్షల విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం మంగళవారం జరిగింది. గాంగేయనల్లూర్ కృపానంద వారియార్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం శివకుమార్ అధ్యక్షత వహించగా, సైన్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి జనార్థనన్, తిరుపత్తూర్ జిల్లా నిర్వాహక కమిటీ సభ్యుడు, మాజీ హెచ్‌ఎం కరుణానిధి ముఖ్యఅతిథులుగా పాల్గొని, విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అముద, జిల్లా ఆర్గనైజర్ కోటీశ్వరి, ఉప ప్రధాన అధ్యక్షుడు విశ్వనాథన్, గాయత్రి, వేలూరు శాఖ సెక్రటరీ సిలువన్ తదితరులు పాల్గొన్నారు.



వేలూరు జిల్లా గుడియాత్తం వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ డెలివరీ సంస్థలకు నిషేధం విధించాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేపట్టిన దృశ్యం

అడయార్ క్యాన్సర్ ఆస్పత్రిలో
డాక్టర్ శాంత విగ్రహం



క్యాన్సర్ హాస్పిటల్ మాజీ అధ్యక్షులు డాక్టర్ శాంత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

● ఆవిష్కరించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆరుదశాబ్దాల పాటు అడయార్ క్యాన్సర్ ఆస్పత్రిలో రోగుల సేవకే తన జీవితాన్ని అంకితమొనర్చిన డాక్టర్ శాంత విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు లభించిన అదృష్టమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. అడయార్ క్యాన్సర్ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఆ ఆసుపత్రి మాజీ అధ్యక్షురాలు దివంగత డాక్టర్ శాంత విగ్రహాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. ఆమె జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన మ్యూజియంను కూడా ఆయన ప్రారంభించారు. ఆమె బసచేసిన ప్రాంతంలో ఏర్పాటైన మ్యూజియం ప్రారంభించడం తనకు లభించిన మహదవకాశమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, శాసనసభ్యులు హసన్ మౌలానా, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, అడయార్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ ఎన్ఎల్ రాజా, డైరెక్టర్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్, హిందూ గ్రూపు డైరెక్టర్ ఎన్. రామ్, డాక్టర్ హేమంత్‌రాజ్, హాస్పిటల్ ఉపాధ్యక్షుడు విజయ్ శంకర్, డాక్టర్ స్వామినాధన్, డాక్టర్ సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



మ్యూజియం ప్రారంభించి వీక్షిస్తున్న స్టాలిన్

ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షులు సెల్వం

వేలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొరప్పాడి మెయిన్ రోడ్డు కామరాజ్‌నగర్‌లో ఎల్ఆర్ఎం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యాలయాన్ని వేలూరు వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యనాధన్, ధనలక్ష్మి, జ్ఞానప్రకాష్, ఢిల్లీ, తిలకవతి, రోహిత్ నివాస్ సహా పలువురు పాల్గొన్నారు.

ద్వంద్వార్థాల డైలాగులుండవు

● సుందర్



తాను దర్శకత్వం వహించే చిత్రాల్లో అసభ్యకర సన్నివేశాలు గాని, ద్వంద్వార్థాలతో డైలాగులు ఉండవని ప్రముఖ సినీ దర్శకుడు సుందర్ సి అన్నారు. ఆయన తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నా చిత్రాలను అత్యధికంగా చూసేందుకు వచ్చే ప్రేక్షకుల్లో చిన్నారులే ఎక్కువగా ఉంటారు. అందువల్ల వారు ఎంజాయ్ చేసేలా సన్నివేశాలుండేలా జాగ్రత్తలు తీసుకుంటాను. చాలామేరకు అసభ్యకర సన్నివేశాలు, డబుల్ మీనింగ్ డైలాగులు ఉండవు. అయితే, నా చిత్రాల్లో గ్లామర్ మోతాదు మాత్రం అధికంగానే ఉంటుంది. చాలామంది దర్శకులు హీరోయిన్ చీరకట్టులో వస్తే టాప్ యాంగిల్‌లో, గౌను ధరిస్తే లో యాంగిల్‌లో ఆ సన్నివేశాలు షూట్ చేస్తారు. కానీ, నేను మాత్రం అలా చేయను. వీలైనంతవరకు కుటుంబ సభ్యులంతా కలిసి సినిమా చూసేలా షూట్ చేస్తాను' అని పేర్కొన్నారు.

గ్యాంగ్‌స్టర్ చిత్రాల్లో నటించాలనివుంది

● పూజా హెగ్డే



సాధారణంగా దర్శకులు హీరోలకు ప్రాధాన్యత ఉండే గ్యాంగ్‌స్టర్ స్టోరీలు రాస్తుంటారని, కానీ, హీరోయిన్లు కూడా నటించే గ్యాంగ్‌స్టర్ స్క్రిప్టులను సిద్ధం చేయాలని హీరోయిన్ పూజా హెగ్డే కోరారు. ఈ మేరకు 'రెట్రో' చిత్ర దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్‌కు ఆమె విన్నవించారు. సూర్యతో కలిసి పూజా హెగ్డే నటించిన 'రెట్రో' మూవీ మే ఒకటో తేదీ విడుదలకానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ, 'నేను హీరోయిన్‌గా తమిళంలోనే పరిచయమయ్యాను. ఈ అవకాశం వచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ మూవీ కోసం తొలిసారి డబ్బింగ్ కూడా చెప్పాను. ఇందులో రుక్మిణి పాత్రలో నటించాను. ఈ తరహా పాత్రను డిజైన్ చేసి అందులో నటించే అవకాశం కల్పించిన దర్శకుడుకి ధన్యవాదాలు. సాధారణంగా హీరోలను దృష్టిలో ఉంచుకుని గ్యాంగ్‌స్టర్ కథలను దర్శకుడు సిద్ధం చేస్తున్నారు. హీరోయిన్లకు ప్రాధాన్యత ఉండే గ్యాంగ్‌స్టర్ స్క్రిప్టు సిద్ధం చేసి అందులో నటించే అవకాశం కల్పించాలని కోరుతున్నాను. ఈ మూవీలో సూర్యతో కలిసి నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చింది' అని ఆమె పేర్కొన్నారు.

రూ.కోట్లు ఉన్నాయ్...
డబ్బు ఆశలేదు

● గంగై అమరన్



సోదరుడు ఇళయరాజాతో గంగై అమరన్

మా వద్ద కోట్లాది రూపాయలు ఉన్నాయని, డబ్బు మీద ఆశలేదని అందువల్ల రాయల్టీ నగదు కోసం ఆశపడనని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు గంగై అమరన్ అన్నారు. తన అన్న, ఇసైజ్ఞాని ఇళయరాజా తాను స్వరపరిచిన పాటలకు సంబంధించి కాపీ రైట్ వ్యవహారంలో తరచుగా వివాదాల్లో చిక్కుకుంటున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో పాటల కాపీ రైట్, రాయల్టీ అంశంపై ఇళయరాజా సోదరుడైన గంగై అమరన్ మాట్లాడుతూ, 'స్టోరీ రాసే దర్శకుడుకి... ఆ స్టోరీ ఎన్ని భాషలకు వెళ్ళినా ఆ కథపై అధికారం ఉంటుంది. కానీ, ఆ చిత్రంలోని పాటలకు దర్శకులకు ఎలాంటి సంబంధం ఉండదు. కారణం.. అదొక ప్రత్యేక కళ. అందుకే నా అన్న ఆ పాటతో పాటు ఆ పాట సంగీతాన్ని తీసుకుంటారు. ఇళయరాజా పాటలను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాటకచేరిల్లో పాడేందుకు అనుమతి కోరగా ఇవ్వలేదు. ఈ విషయంపై నేను మా అన్నతో వాదనకు దిగాను. ఆ తర్వాతే అయన పాటలు ఎస్పీబీ వేదికలపై పాడేందుకు అనుమతిచ్చారు. పైగా మా ఇంట్లో రూ.కోట్లున్నాయి. అందువల్ల పాటలపై వచ్చే రాయల్టీ సొమ్ము కోసం ఆశపడటం లేదు.. దయచేసి అర్థం చేసుకోండి. తప్పుగా ప్రచారం చేయొద్దు' అని పేర్కొన్నారు.

అదో రకమైన మత్తులోకి జారుకుంటా

● ఏఆర్ రెహ్మాన్

చిత్రజ్యోతి



తాను పనిలో నిమగ్నమైనపుడు అదో రకమైన మత్తులోకి జారుకుంటానని ప్రముఖ సంగీత దర్శకుడు, అకాడమీ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహ్మాన్ అన్నారు. ఆయన తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'నాకు కూడా స్నేహితులున్నారు. కానీ, నేనెపుడూ వెనుకబడింది లేదు. నాకు కొన్ని గంటలు అదనంగా లభిస్తే, మరింత ఎక్కువగా పనిచేస్తాను. ఒక పాట సిద్ధం చేసేందుకు ఎనిమిది గంటల సమయం పడుతుందని తెలిసినా... ఏ మాత్రం వెనుకంజ వేయను. మరింత ఎక్కువ సమయం కేటాయించి ఆ పాటను సిద్ధం చేస్తాను. మంచి పని.. మంచి సంతృప్తి. ఇదే నా మంత్రం. ఎక్కువ మంది స్నేహితులు ఉంటే తక్కువ సమయం పని చేయాలన్న నిబంధన ఏదీ లేదు. పైగా నేను పనిలో నిమగ్నమైతే అదో రకమైన మత్తులోకి జారుకుంటాను. ఇంకా బాగా పని చేయొచ్చని నాకు నేను చెప్పుకుంటాను. కొత్త విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. సరికొత్త సంగీత ప్రపంచంలోకి ప్రవేశించడానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటాను' అని పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 59 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్, ప్రజల సమస్యలు తెలుకొనేలా ప్రతి బుధవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పోలీసు అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారు తమ సమస్యలు తెలిపేలా ప్రతి మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మంగళవారం నిర్వహించి శిబిరంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, పోలీసులు పాల్గొని, బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం సహా పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రాణాలకు తెగించి బాలుడిని కాపాడిన యువకుడిని సత్కరించిన ఈపీఎస్



కన్నన్‌కు బంగారు ఉంగరాన్ని తొడుగుతున్న ఎడప్పాడి పళనిస్వామి

టి.నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కం ప్రాంతంలో వాననీటిలో నడుస్తూ విద్యుదాఘాతానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడిని ప్రాణాలకు తెగించి కాపాడిన యువకుడిని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఘనంగా సత్కరించారు. ఈ నెల 16న అరుంబాక్కం ప్రాంతంలో ఓ రహదారిలో ప్రవహిస్తున్న వాననీటిలో రేగన్ (8) అనే బాలుడు నడిచి వెళుతుండగా ఓ విద్యుత్ జంక్షన్ బాక్స్ సమీపంలో అడుగుపెట్టగానే విద్యుదాఘాతానికి గురై నీటిలో పడిపోగా, ఆ మార్గంలో బైకులో వచ్చిన తంజావూరుకు చెందిన కన్నన్ అనే యువకుడు వాననీటిలో ఉన్న బాలుడిని బయటకు తీసి కాపాడి, ఆస్పత్రిలో చేర్పించగా, ప్రాణగండం నుండి బయటపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఈపీఎస్ బాలుడిని కాపాడిన కన్నన్ తన నివాసానికి పిలిపించి అతడికి బంగారు ఉంగరాన్ని తొడిగి ఘనంగా సత్కరించారు.

వైభవంగా వాసవాంబ వసంతోత్సవం



వాసవాంబను కీర్తిస్తున్న ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల విద్యార్థులు

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జి టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో వాసవాంబ వసంతోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు నవరాత్రి వేడుకల్లో అమ్మవారిని విశేషంగా 12 రకాల పూలతో సుందరంగా అలంకరించి సాయంత్రం 6 గంటలకు కళాకారుల బృందాలు కీర్తనలు ఆలపించారు. వాసవీ మాతను దంతపల్లకీ, సింహవాహనంలో ఆలయ ప్రాంగణంలో ఊరేగిస్తున్నారు. బంగారు, వెండి కవచంతో అలంకరించి విశేషపూజలు చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్న భక్తులందరికి ఎస్‌కేపీడీ ట్రస్టీలు తీర్థ, అన్నదాన ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.

తప్పులు లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కులధ్రువీకరణ పత్రాల్లో కులం పేర్లు తమిళం, ఆంగ్ల భాషల్లో ఒకేలా, అక్షర దోషం లేకుండా వుండాలని రాష్ట్రప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు సూచించింది. రాష్ట్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఇసైవేలాలర్ వర్గాలకు 'ఇసైవెల్లాలర్' అనే పేరుతో ధ్రువపత్రాలు ఇస్తున్నారంటూ ఇసైవేలాలర్ సంక్షేమ సంఘానికి చెందిన గుకేష్ మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అందులో బీసీ వర్గాల జాబితాలో వున్న ఇసైవేలాలర్ అనే పేరుతో కాకుండా ఇసైవెల్లాలర్ అనే పేరుతో తన కుమార్తెకు మాంబళం తహసీల్దార్ కార్యాలయంలో అక్షర దోషాలతో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాను గత ఏడాది అక్టోబరులో తమిళనాడు బీసీ సంక్షేమ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని న్యాయస్థానానికి విన్నవించుకున్నారు.ఈ పిటిషన్ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ సుబ్రమణ్యం, రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది.పిటిషనర్ తరుపున హాజరైన న్యాయవాది శక్తివేల్ ఒక కులం పేరులో వున్న అక్షరాలను మార్చడం చట్టవిరుద్ధమని, కులధ్రువీకరణ పత్రాల్లో ఒకేలా కులం పేరు తమిళం,ఆంగ్ల భాషల్లో ఉండేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ అభ్యర్థనను అంగీకరించిన న్యాయమూర్తులు,పిటిషనర్ గుకేష్ కుమార్తెకు ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రంలోని అక్షరదోషాలను సరిచేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు.

నగరత్తార్‌పౌరుల కుల దైవారాధన

● వైదీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద నగరత్తార్ పౌరులు సమర్పించిన పసుపు పుల్లలు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపం వైదీశ్వరాలయంలో తమ కుల దైవం తయ్యల్ నాయకిని దర్శించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి 'నగరత్తార్' పౌరులు వేల సంఖ్యలో తరలిరావటంతో ఆ ఆలయంలో రద్దీ నెలకొంది. వైదీశ్వరాలయంలో తయ్యల్ నాయకి సమేత వైద్యనాథ స్వామివారు కొలువుదీరి ఉన్నారు. ఈ ఆలయంలో నవగ్రహాల్లో ప్రథముడైన అంగారకుడు, సెల్వముత్తు కుమారస్వామి, ధన్వంతరి వేర్వేరు సన్నిధుల్లో పూజలందుకుంటున్నారు. ఈ ఆలయంలోని సిద్ధామృతతీర్థంలో స్నానమాచరించిన భక్తులకు ఇచ్చే 'తిరుచాందురుండై' అనే ప్రసాదాన్ని సేవిస్తే 4448 రకాల వ్యాధులు నయమవుతాయన్నది విశ్వాసం.. ఇంతటి విశేషాలు సంతరించుకున్న ఈ ఆలయంలో ప్రతియేటా చిత్తిరై నెలలో నగరత్తార్ పౌరుల కులదైవ ఆరాధన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రాచీన కాలంలో పూంపుహార్ ప్రాంతం నుండి వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాలకు వసలగా వెళ్ళి నగరత్తార్ పౌరులు తరతరాలుగా ప్రతియేటా చిత్తిరై నెలలో రెండో మంగళవారం పాదయాత్రగా ఈ ఆలయానికి వచ్చి తమ కులదైవమైన తయ్యల్‌నాయకికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆ ప్రకారం మంగళవారం ఉదయం నగరత్తార్ పౌరులు, వారికుటుంబీకులు అమ్మవారికి పసుపు రాసిన పుల్లలను ఆలయ ధ్వజస్తంభం సమర్పించారు. మంగళవారం కారైక్కుడి, శివగంగ, పుదుకోట, తంజావూరు, పరమక్కుడి, తిరుచ్చి జిల్లాల నుండి నగరత్తార్ పౌరులు వేల సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వీరి కోసం సీర్గాళి, మైలాడుతురై, చిదంబరం, తిరుచ్చి, తంజావూరు ప్రాంతాల నుండి సుమారు 300ల ప్రత్యేక బస్సులు కూడా నడిపారు.



చెన్నై అశోక్‌నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటైన జిల్లా కార్యదర్శుల సమావేశంలో గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలంటూ చేసిన తీర్మానంపై ప్రసంగిస్తున్న డీపీఐ అధినేత తొల్‌తిరుమావళవన్

కోనసముద్రం-తిరుత్తణి మధ్య కొత్త బస్సు



కొత్త బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు సమీపం కోనసముద్రం-తిరుత్తణి మధ్య కొత్త బస్సు సేవలను ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు.ఈ మార్గంలో నడుపుతున్న బస్సు శిధిలావస్థకు చేరడంతో, అందులో ప్రయాణం నరకంగా ఉందంటూ ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో ఈ మార్గంలో కొత్త బస్సుల సేవలు కొత్తకుప్పం గ్రామం నుంచి ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో తిరుత్తణి రవాణా కార్యాలయం అధికారి జ్ఞానశేఖర్, డీఎంకే యూనియన్ కార్యదర్శి బీడీ చంద్రన్, మాజీ యూనియన్ కార్యదర్శి తిరుమలై, నాయకులు లోకనాథం, కుమరేశన్, గోవర్ధనన్, శివకుమార్, మణి, సురేష్, కేఎస్ శివ, సెల్వం, రాజేంద్రన్, మణికందన్, దేవరాజన్, మారిముత్తు, ఆనందన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మునీశ్వరాలయ కుంభాభిషేకం



తిరుత్తణి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టులోని మునీశ్వరాలయ కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ కుంభాభిషేక వేడుకలు ఆదివారం నిత్య హోమాలతో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం పూర్ణాహుతి జరిగింది. మంగళవారం ఉదయం భక్తులు పుణ్యతీర్థాల కళశాలతో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు భక్తులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

ఈ సారి రాజ్యసభ సీటు రాకపోవచ్చు

● ఎండీఎంకే నేత వైగో



టి.నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే రాజ్యసభ సభ్యుల ఎన్నికల జాబితాలో ఈ సారి తన పేరు లేకపోయినా బాధపడనని ఎండీఎంకే ఎంపీ వైగో అన్నారు. రాజ్యసభ సీటు తనకు రాలేదని పార్టీ శ్రేణులు ఎలాంటి ఆగ్రహావేశాలు వ్యక్తంచేయకూడదని కూడా ఆయన హెచ్చరించారు. ఎండీఎంకే కార్మిక సంఘం సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగిస్తూ రాజ్యసభ సభ్యుల ఎంపిక జాబితాలో తన పేరు లేకుంటే పార్టీ శ్రేణులు డీఎంకేని తిట్టడం వంటివి చేయొద్దని కూడా చెప్పారు. రాజ్యసభ సీటును విడిచిపెట్టి వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సంపాదించాలనే ప్రణాళిక వేసుకున్నానని వైగో తెలిపారు. ఈ సారి శాసనసభ ఎన్నికల్లో ఎండీఎంకే తరపున 10 మందిని శాసనసభకు పంపాలన్నదే తన ఆశయమని ఆయన చెప్పారు.

పార్టీల జెండాల తొలగింపునకు వారమే గడువు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో బహిరంగ ప్రాంతాల్లో, జనసమర్థమైన ప్రాంతాల్లో పెట్టిన రాజకీయ పార్టీల జెండాల తొలగింపునకు విధించిన గడువు మరో వారంలో ముగియనుంది. అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలు ఇప్పటికే పలు చోట్ల బహిరంగ ప్రదేశాల్లోని జెండాలను తొలగించాయి. సీపీఐ, సీపీఎం, డీపీఐ తదితర పార్టీలు జెండాలను తొలగించలేదు.. మదురై విలాంగుడి ప్రాంతానికి చెందిన సిద్ధన్ వ్యక్తి గత జనవరిలో అన్నాడీఎంకే పార్టీ జెండా పెట్టే విషయమై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఓ పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే నాయకులు ఎంపిక చేసిన ప్రాంతంలో జెండా పెట్టేందుకు పోలీసులు అనుమతించడం లేదని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో పెట్టిన కుల సంఘాల, వివిధ సంస్థల, మత సంస్థల, రాజకీయ పార్టీల జెండాలన్నింటిని 12 వారాల్లోగా తొలగించాలని జనవరి 27న పోలీసులకు, రాష్ట్ర డీజీపీకి ఉత్తర్వులిచ్చారు. జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించేలా, ప్రజలు ఎక్కువ సంఖ్యలో తిరిగే ప్రాంతాల వద్ద నాటిన జెండాలను పోలీసులు తొలగించాలని ఆదేశించారు. ఇక ప్రైవేటు భూముల్లో, పట్టా ప్రాంతాల్లో పార్టీ జెండాలుంటే ఆ స్థలం యజమానుల నుండి అనుమతి ఉండాలని కూడా హైకోర్టు ఆ ఆదేశంలో పేర్కొంది. ఆ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పట్టా భూముల్లో నాటిన పార్టీ జెండాలకు స్థల యజమానుల అనుమతిని పొందేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తలమునకలవుతున్నాయి. గడువులోగా తొలగించని జెండాలను అధికారులు తొలగించి, ఆ జెండాల తొలగింపునకు అయ్యే ఖర్చు ఆయా పార్టీల నుంచి వసూలు చేయాలని కూడా ఆదేశించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులిచ్చినప్పటి నుంచి డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు జెండాలను క్రమంగా తొలగించాయి. ఇదే విధంగా, కాంగ్రెస్, ఎండీఎంకే, డీకే తదితర పార్టీలకు చెందిన జెండాలను కూడా తొలగించారు. ప్రస్తుతం జెండాల తొలగింపునకు హైకోర్టు డివిజన్ విధించిన గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ పరిస్థితులలో కార్మిక సంఘాలు అధికంగా కలిగిన సీపీఐ, సీపీఎం పార్టీలు ఇంకా జెండాలు తొలగించలేదని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సీపీఎం అప్పీలు..

మదురై హైకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తి ఇలంతిరయన్ రాజకీయ పార్టీలు, సంస్థలు, కుల సంఘాలకు చెందిన పతాకాలను తొలగించాలని గత జనవరి 21న వెలువరించిన ఉత్తర్వును వ్యతిరేకిస్తూ సీపీఎం తరపున అప్పీలు పిటిషన్ దాఖలైంది. జెండాలను తొలగించాలని ఉత్తర్వులివ్వడం భావస్వేచ్ఛకు, రచనా స్వాతంత్ర్యానికి, సంఘాల ఏర్పాటుకు వ్యతిరేకమని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. కమ్యూనిస్టు పార్టీలు కార్మికులు, రైతు కూలీలు వంటి శ్రామికవర్గానికి అధిక ప్రాధాన్యమిచ్చే పార్టీలనీ, ఆ పార్టీల పతాకాలపై ప్రజలు గౌరవభావంతో ఉంటున్నారనే విషయం పరిగణనలోకి తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

తిరుమలలో తమిళనటుడు విజయ్‌కుమార్



తమిళ సినీనటుడు విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తె, నటి శ్రీదేవి, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం బయట నటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో తిరుమలకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నారా రోహిత్‌తో నటించిన 'సుందరకాండ' త్వరలో విడుదల కాబోతోందని చెప్పారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో చల్లదనం కోసం..



ఆలయం ముందు నీరు వదులుతున్న ట్యాంకర్

చల్లని తిరుమల కొండ కూడా ఎండకు వేడెక్కిపోతోంది. మాడవీధుల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ ఇప్పటికే కూల్‌పెయింట్ వేసింది. తాత్కాలిక షెడ్లు నిర్మించింది. మాడవీధుల్లో గ్యాలరీల వెంబడి గ్రీన్ తెరతో పైకప్పులను ఏర్పాటు చేశారు. అయినా బండలు పరిచిన నేల సెగలు కక్కుతూనే ఉంది. దీంతో ప్రతి రెండు గంటలకోసారి ట్యాంకర్ల ద్వారా ఆలయ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో నీటిని నిరంతరాయంగా నీటిని చల్లుతున్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.79కోట్లు


సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,937

తలనీలాలు సమర్పించినవారు: 24,157



● నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

పుస్తకం చిన్నబోతోంది..



నడిపేది..నడిపించేది..
పెను నిద్దుర వదిలించేది..
సమగ్ర వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది..
నిరంతరం మార్పు వైపు నడిపించేది పుస్తకం. నిజమే కానీ నేటి ఆధునికత పుస్తకాన్నీ ప్రభావితం చేస్తోంది. చదువరులను తగ్గించేస్తోంది. పుస్తక పఠనమే వ్యక్తిగత అభివృద్ధికి సోపానమనే విషయాన్ని విస్మరిస్తోంది. తద్వారా నేటి యువత చాలా నష్టపోతోందని పలువురు రచయితలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాన్ని దగ్గరకు తీసుకోవాల్సిన అవసరాన్ని వీరు నొక్కివక్కాణిస్తున్నారు. పఠనంతో మంచి జీవితానికి బాటలు వేసుకోవచ్చునని హితవు పలుకుతున్నారు. పుస్తకాలను పక్కకు నెట్టి ఎలక్ట్రానిక్ పరికరాలతో కాలక్షేపం చేస్తే భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి అతుక్కుపోయి ఒత్తిడి, మానసిక సమస్యలు,అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని గుర్తు చేస్తున్నారు. బుధవారం ప్రపంచ పుస్తకదినోత్సం సందర్భంగా పలువురు రచయితలు ఏమంటున్నారంటే...


– తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

తలదించుకుని చదివితే తలెత్తుకునేలా....

పుస్తకాన్ని తలదించుకుని చదివితే జీవితాంతం తలెత్తుకునేలా చేస్తుంది. చదివేకొద్దీ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి గత రెండు సంవత్సరాలుగా బాలల నేస్తం పేరుతో మాసపత్రికను రూపొందిస్తున్నాం. ఇందులో పిల్లలు రాసిన బాలసాహిత్య కథలు, గేయాలు, చిత్రాలు సృజనాత్మకత అంశాలతో ఎందరో విద్యార్థులను పఠనం వైపు తీసుకెళ్తున్నాం. పిల్లలకు కథల ద్వారా లోకంలో ఉన్న మంచి చెడులు తెలుస్తాయి. పుస్తక పఠనం దినచర్యలో భాగం కావాలి.

– యువశ్రీ మురళి, అరసం జిల్లా అధ్యక్షులు

వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి...



పుస్తక పఠనం వల్ల మనిషిలోని వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి. జీవిత చరిత్రలు చదివితే మనిషి మనిషిగా ఎదగడమే కాక తనను తాను మంచి వ్యక్తిగా తయారు చేసుకుంటాడు. గతంలో గ్రంథాలయాలకు వెళ్లి ఇతిహాసాల నుంచి అనేక రకాల పుస్తకాలను చదవడం వల్ల ధర్మం నాలుగు పాదాలపై నిలబడిందనుకుంటాను. ఇప్పుడు ఇంట్లో అందరూ సెల్‌ఫోన్లు పట్టుకుని తమ లోకంలో ఉండిపోతున్నారు. దీనివల్ల పిల్లలకు కంటిచూపు దెబ్బతింటోంది. కళ్లజోళ్ల పరిస్థితి వస్తోంది

– పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కథా రచయిత



పుస్తక పఠనం అదృష్టం

విద్యార్థుల్లో పుస్తకాలు చదవడం తగ్గిపోయింది. ఇది చాలా బాధాకరం. పుస్తక పఠనం వ్యక్తిని ఎప్పుడూ చురుకుదనంతో ఉంచుతుంది. నాకిప్పుడు 70 ఏళ్లు. 35 పుస్తకాలు రాశాను. సాహితీవేత్తలతో మమేకమవుతుంటాను. రోజూ ఏదో ఒక పుస్తకం చదవడం వల్ల ఉత్సాహంగా ఉంటున్నాను. చిన్న చిన్న ప్రయాణాల్లో సైతం తోడుగా ఎల్లప్పుడూ పుస్తకాలు ఉంటాయి. పుస్తకాలు చదవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా చేసుకోవాలి. పుస్తక పఠనం దక్కిందంటే అదృష్టంగా భావించాలి.

– డాక్టర్ త్యాగదుర్గం మౌని, సాహిత్యవేత్త



తోడు నిలిచే నేస్తం పుస్తకం...

పుస్తకం జ్ఞానాన్ని పెంచే నిధి అక్షరాలను అందంగా దాచుకొన్న తరగని గని. తోడు నిలిచే నేస్తం. కానీ పుస్తక పఠనం నేటి యువతకు దూరమవుతోంది. సెల్‌ఫోన్ వాడటం తప్పుకాదు గానీ దానిని ఎంత వరకు వాడాలో అంతవరకే వాడాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి పుస్తక పఠనం వైపు దారి మళ్లించాలి. పిల్లలను సమయం దొరికినప్పుడల్లా మంచి పుస్తకాలను చదివించాలి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారంతా పుస్తకాల ప్రేరణ పొందారని గమనించాలి.



– మూరిశెట్టి గోవింద్, కథ, నవలా రచయిత







రుయా.. చూపాలిలా దయ

భానుడు చెలరేగిపోతున్నాడు.నిప్పులు చెరుగుతున్నాడు. సాధారణ ప్రజలే ఈ ఎండల తాకిడికి అల్లాడిపోతుంటే మరి రోగుల పరిస్థితి మాటేంటి.. ఈక్రమంలోనే రుయాస్పత్రిలో తీసుకున్న చర్యలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. వీల్ ఛైర్లు, స్ట్రెచర్లపై రోగులను తీసుకువెళ్లేవారికి ఊరటనిస్తున్నాయి. ఆస్పత్రిలోని అంతర్గత మార్గాల్లో ఎండ తగలకుండా ఏర్పాటు చేసిన పచ్చని పందిళ్లు రక్షణగా నిలుస్తున్నాయి. చెప్పులు కూడా లేకుండా వచ్చే రోగులకు సైతం ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ విధమైన ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆస్పత్రి అధికారులకు రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

సహజ వనరుల వెలికితీతలో అప్రమత్తం

● అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్త బలరాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అరుదైన సహజ వనరుల సద్వినియోగంలో చైనాను మన దేశం అధిగమించవలసి ఉందని హైదరాబాదులోని నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి. బలరాం పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్- పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండవ రోజు(మంగళవారం) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎస్వీయూ సెనేట్ హాలు వేదిక జరిగిన సదస్సులో బలరాం మాట్లాడుతూ మన దేశంలో లభించే అరుదైన మూలకాలను వెలికితీసే, వినియోగించుకునే అంశాల్లో మార్పులు రావాలన్నారు. యురేనియం వంటి సహజ వనరులను వెలికి తీసే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం మంచిది కాదన్నారు. లేకపోతే,ఈ మూలకాల నుంచీ వెలువడే వ్యర్థాలు క్యాన్సర్, కిడ్నీ జబ్బులకు కారణమవుతాయన్నారు. ఢిల్లీ తరహా కాలుష్యాన్ని కూడా ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హైదరాబాదు బిట్స్ పిలానీ ప్రతినిధి డాక్టర్ బీఎం రెడ్డితో పాటు పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధకులు పేపర్, ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్స్ చేశారు. వీరిని అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సర్టిఫికేట్, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాకక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ బలరాం

గుజరాత్ నుంచి ఉప్పు దిగుమతి

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉప్పు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్ నుంచి తూత్తుకుడికి 40వేల టన్నుల ఉప్పు దిగుమతి అయింది. తూత్తుకుడి జిల్లాలో ఉప్పు ఉత్పత్తి అధికంగా జరుగుతోంది. ఈ వ్యాపారంతో సుమారు 60 వేల మంది ఉపాధి పొందుతుండగా, ఏడాదికి 25 లక్షల టన్నుల ఉప్పు ఉత్పత్తి జరుగుతోంది. ఇక్కడ తయారయ్యే ఉప్పు రాష్ట్రంతో పాటు కేరళ, ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో, హఠాత్ వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో, ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన ఉత్పత్తి ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అదే సమయంలో, ఉప్పు తయారీ 60 శాతం తగ్గిపోవడంతో, ప్రస్తుతం టన్ను రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రమవుతోంది. అదే సమయంలో గుజరాత్ ఉప్పు టన్ను రూ.4 వేల నుంచి రూ.4,500 కు విక్రయమవుతోంది. ఈ క్రమంలో గుజరాత్ నుంచి 40 వేల టన్నుల ఉప్పును నౌక ద్వారా తూత్తుకుడికి తరలించారు. మరో కొన్ని రోజుల్లో మరో 30 వేల టన్నులు దిగుమతి చేసుకోవాలని నిర్ణయించినట్లు ఉప్పు తయారీ కర్మాగారాల యజమానులు తెలిపారు.

నేడు టాస్మాక్ కేసులో తీర్పు

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ప్రధాన కార్యాలయంల ఈడీ నిర్వహించిన తనిఖీలు వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో, ఈ నెల 23న మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించనుంది. నుంగంబాక్కంలోని టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో కొద్దిరోజుల క్రితం ఈడీ తనిఖీలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహించిన తనిఖీలు చట్టవిరుద్ధమని ప్రకటించాలని, విచారణ పేరుతో అధికారులను వేధించడంపై నిషేధం విధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో, రాష్ట్ర ప్రభుత్వం, టాస్మాక్ సంస్థ తరఫున పిటిషన్లు దాఖలయ్యాయి. న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియమ్, కె.రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారిస్తోంది. టాస్మాక్ అధికారులు, సిబ్బంది చట్టవిరుద్ధంగా నగదు బదిలీలకు పాల్పడుతున్నారని అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఈడీ వివరించింది. ఈ నేపథ్యంలో, సోమవారం అన్ని తరఫు వాదనలు ముగియడంతో, ఈ కేసు తీర్పును ఈ నెల 23కు వాయిదావేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

రేషన్ దుకాణాల ముందు మొక్కల పెంపకం

● మంత్రి చక్రపాణి

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రేషన్ దుకాణాల ముందు మొక్కలు నాటి శ్రద్ధగా పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి చక్రపాణి పేర్కొన్నారు. అసెంబ్లీలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్ దుకాణాల ముందు మహిళలు ఎండలో నిలబడి సరుకులు తీసుకుంటున్నారని, అందువల్ల ఆ దుకాణాల ముందు పందిళ్లు ఏర్పాటు చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే వెంకటేశ్వరన్ కోరారు. అందుకు మంత్రి సమాధానమిస్తూ, రేషన్ దుకాణాల ముందు చెట్లు నాటే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గత ఏడాది రైతుల నుండి 24 లక్షల టన్నులు, ఈ ఏడాది 32 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

టాస్మాక్ ఉద్యోగులకు వేతనం పెంపు

● మంత్రి సెంథిల్ బాలాజీ

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ సంస్థ ఉద్యోగులకు రూ.2వేలు వేతనం పెంచినట్లు అసెంబ్లీలో మంత్రి సెంథిల్ బాలాజీ ప్రకటించారు. మంగళవారం ఉదయం అసెంబ్లీలో మంత్రి సెంథిల్ బాలాజీ టాస్మాక్ సంస్థకు సంబంధించి కొత్త ఉత్తర్వులు ప్రకటించారు. టాస్మాక్ మద్యం చిల్లర దుకాణాల్లో 6,576 మంది సూపర్‌వైజర్లు, 14,636 మంది సేల్స్‌మెన్లు, 2,426 మంది అసిస్టెంట్ సేల్స్‌మెన్లు పనిచేస్తున్నారని, వీరికి పెంచిన రూ.2వేల వేతనం ఈ నెల జీతంతో కలిపి ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయం చేసే రైతులకు కొత్తగా 50వేల విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతించిందన్నారు. తూత్తుకుడిలో 600 మెగావాట్లుల విద్యుదుత్పత్తి చేసేలా థర్మల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ బోర్డులో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు మంత్రి సెంథిల్ బాలాజీ అసెంబ్లీలో ప్రకటించారు.

కళ్లకురుచ్చి కల్తీసారా కేసులో ఇద్దరికి బెయిల్

ప్యారీస్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కళ్లకురుచ్చి జిల్లా కరుణాపురం గ్రామంలో గత ఏడాది కల్తీసారా తాగి 67 మంది మృతిచెందిన కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితులకు మద్రాస్ హైకోర్టు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. విల్లుపురం జిల్లా ఎక్సైజ్ పోలీసులు కరుణాపురం గ్రామంలో కల్తీసారా విక్రయించిన దామోధరన్, గోవిందరాజన్ సహా 21 మందిని అరెస్టు చేశారు. కొన్నాళ్ళ తర్వాత ఈ కేసు విచారణ సీబీఐకు బదిలీ అయ్యింది. 67 మందిని బలిగొన్న ఈ కల్తీసారా కేసుకు సంబంధించి దర్యాప్తును సీబీఐ అధికారులు వేగవంతం చేసి న్యాయస్థానంలో ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. 10 నెలలకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న వారిలో ప్రధాన నిందితుడైన దామోధరన్, గోవిందరాజన్ తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సుందరమోహన్ సమక్షంలో ఈ పిటిషన్ విచారణకు రాగా, సీబీఐ తరుపున హాజరైన న్యాయవాదులు కల్తీసారా విక్రయించి పట్టుబడిన నిందితులకు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. 10 నెలలుగా జైలులో బంధీలుగా వున్నందున బెయిల్ మంజూరు చేయాలని పిటిషనర్ తరుపు న్యాయవాది కోరారు. ఇందుకు అంగీకరించిన న్యాయమూర్తి దామోధరన్, గోవిందరాజన్‌లకు బెయిల్ మంజూరు చేసి, మరు ఉత్తర్వులు వచ్చేవరకు విచారణ అధికారి ముందు ప్రతిరోజు హాజరుకావాల్సిందిగా ఆదేశించారు.

సౌర విద్యుదుత్పత్తిలో నాలుగో స్థానం

పెరంబూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుదుత్పత్తిలో రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచింది. గత 2024-25వ సంవత్సరంలో 10,153.49 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేసిన రాష్ట్రం, జాతీయ స్థాయిలో మూడవ స్థానం నుంచి నాలుగవ స్థానానికి దిగజారింది. ఈ విషయమై కేంద్ర నూతన, పునరుత్పాదన ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... సౌర విద్యుదుత్పత్తిలో జాతీయ స్థాయిలో పలు రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. ఆ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో తమిళనాడులో 10,153.48 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి జరిగి, జాతీయ స్థాయిలో నాలుగవ స్థానంలో నిలిచింది.



శివగంగ వద్ద ప్రమాదం



రెండు లారీ మధ్య ధ్వంసమైన రవాణా సంస్థ బస్సు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీలు

22 మందికి గాయాలు

చెన్నై, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శివగంగ సమీపం మదురై రహదారిలోని సెంబూరు కాలనీ వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 మంది గాయపడ్డారు. సెంబూరు కాలనీ సమీపంలో డీజిల్, వంటగ్యాస్‌లోడ్లతో వెళుతున్న రెండు ట్యాంకర్ లారీలు రాష్ట్ర రవాణా సంస్థ బస్సును ఢీకొన్నాయి. శివగంగ వైపు వెళుతున్న డీజిల్ ట్యాంకర్ లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించి ఎదురుగా మదురై వైపు వస్తున్న రాష్ట్ర రవాణా సంస్థ బస్సును ఢీకొంది. అదే సమయంలో డీజిల్ ట్యాంకర్ లారీ వెనుక నుంచి వచ్చిన వంటగ్యాస్ ట్యాంకర్ లారీ కూడా బస్సును ఢీకొంది. ఇలా ఒకే సమయంలో రెండు లారీలు ఢీకొనటంతో బస్సు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో డీజిల్ ట్యాంకర్ లారీ డ్రైవర్ నందకుమార్, బస్సులోని 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. తిరుభువనం, పూవంది, శివగంగ ప్రాంతాల నుండి తెప్పించిన అంబులెన్స్‌ల్లో గాయపడినవారిని శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో ట్యాంకర్ లారీ నుండి గ్యాస్ లీక్ కాకుండా అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టారు.